వణికిస్తున్న జ్వరాలు



సలీం నగర్‌లో ఇళ్ల ఎదుట మురుగుకాల్వ నిండిన దుస్థితి

నంద్యాల హాస్పిటల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణ మార్పులు, వర్షాలు వెరసి రోగాలకు నిలయంగా జిల్లా నిలిచింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మురుగు కూపాలుగా మారాయి. కనీస చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలో జ్వర పీడితులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వాతావరణ మార్పులతో జ్వరాలు అధికమయ్యే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మురుగుకాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయాల్సి ఉండగా అలాంటి చర్యలు ఏ గ్రామంలోనూ కనిపించడంలేదని ప్రజలు వాపోతున్నారు.

ఇళ్ల మధ్యే మురుగు..

ఖాళీ స్థలాల్లో ఇటీవలి వర్షాలకు నీరు చేరి కుంటలుగా మారాయి. ఇళ్ల మధ్యలో మురుగు నీరుండటంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల పట్టణంలో మురుగుకాల్వలు నీరు పారక ప్లాస్టిక్‌వ్యర్థాలతో కాల్వలు నిండిపోయి ఇళ్ల ముందు పరిస్థితి అధ్వానంగా మారింది. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా చేయలేని దుస్థితిలో నంద్యాల మున్సిపాల్టీ ఉన్నట్లు తెలుస్తోంది. వర్షం పడితే ప్రధాన రహదారులు జలమయం కావాల్సిందే. కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నక్రమంగా పారక రోడ్లపైకి చేరుతూ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీస్థలాల యజమానులకు నోటీసులిచ్చి స్థలాలు చదునుగా చేసుకుంటే వర్షపునీరు నిల్వ ఉండకుండా ఉంటుంది. అలాంటి చర్యలు నంద్యాలలో తీసుకున్న దాఖలాల్లేవు. గ్రామీణ ప్రాంతాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పంచాయతీలకు నిధుల్లేక, నిధులున్నా వినియోగించక ప్రజలు ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారు. ఇళ్లముందే మురుగునీరు నిల్వ ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

వాతావరణ పరిస్థితుల్లో మార్పు.. పారిశుధ్యం లోపించడం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇళ్ల మధ్యే మురుగు కూపాలు ఏర్పడటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. నంద్యాల పట్టణంలో మురుగుకాల్వలు నీరు పారక ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఇళ్లముందు పరిస్థితి అధ్వానంగా మారింది. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా చేయలేని దుస్థితిలో నంద్యాల మున్సిపాల్టీ ఉన్నట్లు తెలుస్తోంది. వర్షం పడితే ప్రధాన రహదారులు జలమయం కావాల్సిందే. గ్రామీణ ప్రాంతాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పంచాయతీలకు నిధుల్లేక, నిధులున్నా వినియోగించక ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అధికారులు శానిటేషన్‌పై దృష్టిసారించి కనీసం బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయించి ప్రజల ఆరోగ్యానికి భద్రత ఇవ్వాలి.

విషజ్వరాలుగా మారి ప్రాణాలకే..

గ్రామాల్లో దాదాపు ఇంటికి ఒకరు చొప్పున జ్వరాలతో మంచం పట్టారు. జ్వరాలు తగ్గకపోతే విషజ్వరాలుగా మారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందనేది వైద్యుల వాదన. ఇటీవల బేతంచెర్ల, డోన్ ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా రావడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం జిల్లాలో శానిటేషన్‌పై కలెక్టర్ దృష్టిసారించి అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నా ఫలితం నామమాత్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.



జీజీహెచ్‌లో ప్రస్తుతం ఓపీ..

నంద్యాల జీజీహెచ్‌లో ప్రస్తుతం ఓపీ అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలనుంచి వస్తున్న రోగులు జీజీహెచ్‌లో వైద్యచికిత్స చేయించుకుంటున్నారు. పారిశుధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు సొంత వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా వైద్యుల సూచనలతో చికిత్సపొందితే ప్రయోజనం ఉంటుంది. నంద్యాల పట్టణంలో దోమలు విపరీతంగా ఉండటంతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు శానిటేషన్‌పై దృష్టిసారించి కనీసం బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయిస్తే ప్రజల ఆరోగ్యానికి భద్రత ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

- లోపించిన పారిశుధ్యం
- ప్రజల పాలిట శాపం
- మురుగు కూపాలపై చర్యలు శూన్యం
- అప్రమత్తత లేకపోతే ప్రాణాలకే ప్రమాదం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పద్మావతినగర్‌లో పాఠశాల పక్కనే రోడ్డుపై మురుగు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు



జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. పీహెచ్‌సీల పరిధుల్లో ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది జ్వర పీడితులను గుర్తించి వైద్యసేవలు అందించాలి. శానిటేషన్‌పై ప్రతిరోజు కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు ఆరు మలేరియా కేసులు, 75 డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

● డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

సీమను సస్యశ్యామలం చేసేందుకు కృషి

- పాణ్యం నియోజకవర్గంలో అభివృద్ధి పరవళ్లు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- దుర్వేశి గ్రామంలో 'తొలి అడుగు'



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుర్వేశి గ్రామంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 'తొలి అడుగు'లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి గోదావరి నీటిని తీసుకొచ్చేందుకు బనకచర్ల ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు తెలంగాణ ప్రజలను రెచ్చగొడుతున్నాయన్నారు. కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కుందూ నీటి పరవళ్లలాగా పాణ్యం నియోజకవర్గం ఏడాదిలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 'తల్లికి వందనం'లో 32,145 మంది, దీపం పథకంలో 7,914 మంది, అన్నదాత సుఖీభవ పథకంలో 45,775 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఆడబిడ్డకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాలన్న ఉద్దేశంతో 'ఆడబిడ్డ నిధి' పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు త్వరలో అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో 45 ఆలయాల పునఃనిర్మాణానికి రూ.43.25 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, పాణ్యం నియోజకవర్గ అబ్జర్వర్ గాజుల ఆదెన్న, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గీత తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 35.4 మి.మీ., వర్షపాతం



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో సోమవారం రాత్రి 35.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరులో 15.8, కొత్తపల్లెలో 10.4, ప్యాపిలి 9.8, మహానంది 8.2, వెలుగోడు 8.0, కొలిమిగుండ్ల 7.6, గడివేముల 6.8, చాగలమర్రి 5.2, పాములపాడు 4.2, పగిడ్యాల 3.8, మిడ్తూరు 3.4, నంద్యాల పట్టణం 3.2, బండిఆత్మకూరు 3.2, నందికొట్కూరు 2.6, అవుకు 2.4 మి.మీ., వర్షపాతం నమోదైంది.

అటవీ శాఖలో రూ.4.37 కోట్ల అక్రమాలు

ఆత్మకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన అటవీశాఖ సొమ్ము కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. మొదటి నుంచి అనుమానాస్పదంగా ఉన్న ఈ కేసులో రూ.4.37 కోట్లు అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో సుమారు 15ఏళ్ల పాటు ఏవోగా పనిచేసి గత ఏడాది జూలైలో పదవీవిరమణ పొందిన ఏ.ఎస్.చాంద్‌బాషా తాను పని చేసిన సమయంలో అటవీశాఖకు చెందిన సొమ్మును తన సొంత అవసరాలకు దారి మళ్లించాడు. తొలుత రూ.19,25,993 విలువ గల రెండు చెక్కులను ఎఫ్‌డీపీటీ నంద్యాల చెందిన అకౌంట్‌కు పంపించాల్సి ఉండగా ఆ సొమ్మును తన బంధువుల పేర్లతో డ్రా చేసుకున్నాడు. దీనిపై ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదిన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారించగా ఇప్పటివరకు రూ.4,37,65,501 అటవీశాఖ సొమ్మును స్వాహా చేసినట్లు అధికారులు తేల్చారు. ఇందులో ప్రధాన ముద్దాయి చాంద్‌బాషా అటవీ సొమ్మును తన కుటుంబసభ్యులు, అనుచరుల ఖాతాకు మళ్లించుకున్నాడు. ఇందులో చాంద్‌బాషా సోదరుడు మగ్బూల్‌బాషా ఖాతాలోకి రూ.65లక్షలు, మరో సోదరుడు సలాంబాషా ఖాతాలోకి రూ.6,500, కుమారుడు బాషా ఖాతాలోకి రూ.2వేలు, సోదరి అమిదాబేగం ఖాతాలోకి రూ.36.36లక్షలు, మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకటశివయ్య ఖాతాలోకి రూ.1.47కోట్లు, శివయ్య భార్య జయలక్ష్మీ ఖాతాలోకి రూ.66.9లక్షలు, అతని తల్లి రాజేశ్వరీ ఖాతాలోకి రూ.47.89లక్షలు చొప్పున దారిమళ్లించి వాటిని సొమ్ము చేసుకున్నాడు. అయితే చాంద్‌బాషా ఖాతాలోకి మాత్రం కేవలం రూ.6,500 మాత్రమే వెళ్లినట్లు తెలిసింది. అటవీశాఖ సొమ్ము స్వాహా వ్యవహారంలో చాంద్‌బాషా తన అక్రమాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు చాలా పకడ్బందీగా వ్యవహరించాడు.



వివరాలు వెల్లడిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

- ఇద్దరి అరెస్టు
- అధికారుల నిర్లక్ష్యంపై అన్ని కోణాల్లో దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

అక్రమాలు ఇలా..!

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి, లింగాగట్టు, శిఖరం చెక్‌పోస్టులతో పాటు సాక్షిగణపతి వద్ద పార్కింగ్ ఫీజుల పేరిట పర్యావరణ రుసుం వసూలు చేస్తారు.

మిగతా 6వ పేజీలో

అరటిలో సస్య రక్షణ చర్యలు పాటించాలి

జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు



అరటి తోటను పరిశీలిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అరటిలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి, పామాయిల్ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైతులు తోటల పెంపకంలో ఎప్పటికప్పుడు నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. అరటి, పామాయిల్ తోటల్లో మొక్క విత్తిన 45 రోజుల్లో వేరుకుళ్లు, కాండం తొలుచు పురుగుల ఉధృతి కొనసాగుతందని తెలిపారు. వీటిని అరికట్టేందుకు ఉద్యాన పంటల్లో సహజ సిద్ధ ఎరువులను వాడాలన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీ కింద ఆయిల్‌పామ్ మొక్కలను అందజేస్తుందని, సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి తేజేశ్వరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీశైలం దేవస్థాన ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీశైలం దేవస్థాన ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు మంచినీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో టీడీఎస్ తనిఖీ చేయాలన్నారు. దేవస్థానం వైద్యశాలలో అవసరమైన మందులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయా మందుల ఇండెంటే ముందస్తుగానే వైద్యశాల విభాగాధికారికి అందజేయాలని దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అపోలో డాక్టర్లును ఆదేశించారు. ప్రధానకూడళ్లలో అవగాహన బోర్డులను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం అన్ని విభాగాలు, దేవస్థానం వైద్యశాల సిబ్బంది, మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది అందరూ కూడా సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. దేవస్థానం ఇంజనీర్లు, సంబంధిత శాఖల ఉద్యోగులు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

- మహిళా కమిషన్ దృష్టికొచ్చిన సమస్యలు పరిష్కరిస్తాం
- రాష్ట్రంలో 156 శక్తిటీమ్‌లు ఏర్పాటు
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ
- సమస్యలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ రాజకుమారి
- మహిళల భద్రతపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ ఎస్‌లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన మహిళా సంక్షేమం, భద్రత, మహిళా సాధికారత అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విద్యార్థినులకు చదువు ఎంతో ముఖ్యమో భద్రత కూడా అంతే ప్రధానమన్నారు. ఘటన జరిగిన తర్వాత తీసుకునే చర్యలకంటే ఘటన జరగకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు, మహిళలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి కేవలం రెండు అర్జీలు వచ్చాయని, అందులో వెలుగోడులో మైనర్ బాలికపై జరిగిన సంఘటన కమిషన్ సుమోటోగా తీసుకుని విచారించిందన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైందని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ) ఏర్పాటుచేయాలన్నారు. ఈకమిటీలపై జిల్లా యంత్రాంగం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో మహిళల సంరక్షణ కోసం 156 శక్తిటీమ్‌లను ఏర్పాటుచేసి 900 ప్రదేశాలను గుర్తించామన్నారు. విద్యార్థినులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వన్‌స్టాప్ సెంటర్‌ల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మహిళల, పిల్లల భద్రతకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేయడం జరుగుతోందన్నారు. జిల్లా కొత్తగా ఏర్పాటయ్యాక శిశుగృహాన్ని, డీసీపీయూ యూనిట్‌ను, వన్‌స్టాప్ సెంటర్‌ను ఏర్పాటుచేసుకున్నామన్నారు. ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 1663 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని వివరించారు. 48 హాబిటేషన్స్‌లో 2500 చెంచు జాతి కుటుంబాలున్నాయని, 8 వేల జనాభాలో పిల్లలు ఎక్కువగా ఉన్నారన్నారు. సామాజికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏఎస్పీ జావలి మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీసుశాఖ నిరంతరం కృషిచేస్తోందన్నారు. కళాశాలల్లో చదువుతున్న అమ్మాయిలు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన మహిళా మేలుకో బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, సీఐలు గౌతమి, జయరామ్, సీడీపీవోలు పాల్గొన్నారు.

పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా కమీషన్ ప్రాతిపదికన పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కమీషన్ పద్ధతిన డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తామన్నారు. పదో తరగతి, ఆపై చదివి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 31 వరకు (ఆదివారం మినహా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఏజెంట్లకు కమీషన్ ఇస్తారన్నారు. ఇతర వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.హరికృష్ణారెడ్డి సెల్ నంబర్ 70130 29312ను సంప్రదించాలని సూచించారు.

దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి ఆనం పూజలు



పూజలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ మంత్రి

గడివేముల, జూలై 22(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా పేరుగాంచిన గడివేముల మండలంలోని దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, పూజారులు మంత్రి ఆనంకు ఘన స్వాగతం పలికారు.

మెగా టోర్నీకి సై



- ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు తెలుగు కబడ్డీ లీగ్
- గ్రామీణ యువతలో ప్రతిభను వెలికితీసేందుకు శ్రీకారం
- ఈనెల 25 నుంచి యువ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ
- ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సన్నాహాలు

కోసిగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ సంఘం మెగా టోర్నీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కోసిగికి కబడ్డీలో మంచి పేరుంది. గ్రామీణ యువకులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కబడ్డీ లీగ్ వంటి మెగా టోర్నమెంట్లు జరిపేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నడుం బిగించింది. ఈనెల 25వ తేదీ నుంచి కాకినాడ వేదికగా యువ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టినట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు చావిడి వెంకటేశ్, జిల్లా సెక్రటరీ వలకలదిన్నె వెంకటేశ్ తెలిపారు. ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు తెలుగు కబడ్డీ లీగ్ పేరిట మెగా టోర్నీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టోర్నీ విజేతకు యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందజేస్తున్నామన్నారు. ఈ టోర్నీకి మొత్తం ఎనిమిది జట్లను ఎంపిక చేయనున్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని, కర్నూలు, పత్తికొండ డివిజన్ల నుంచి ముఖ్యంగా కోసిగి, ఆదోని, ఆస్పరి, కౌతాళం, గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, సి.బెళగల్, కర్నూలు, మద్దికెర, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, పత్తికొండ తుగ్గలి మండలాల నుంచి కబడ్డీలో క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. ఒక్కో జట్టులో 12మంది క్రీడాకారులు, మరో ఐదుగురు రిజర్వు క్రీడాకారులను ఎంపిక చేసి పోటీలు జరిగే వేదికలను ఖరారు చేస్తున్నామని తెలిపారు. విజేతలకు, క్రీడాకారులకు ప్రతి మ్యాచ్‌లో నగదు బహుమతులు, నజరానాలు ప్రకటించేలా ఆంధ్ర కబడ్డీ అసోసియేసన్ సన్నాహాలు చేస్తుంది. పాల్గొనబోయే జట్ల ఎంపికలను ఈ నెల 25వ తేదీన ఉదయం 7 గంటల నుంచి కాకినాడలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడా మైదానం వేదికగా నిర్వహించనున్నారు.

నిబంధనలు ఇవే

కబడ్డీ టోర్నీకి సంబంధించి క్రీడాకారులకు కొన్ని నిబంధనలు పెట్టారు. ప్రతి జట్టులో ఐదుగురు క్రీడాకారులు 23ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలి. ప్రతి జట్టులో ఏడు మంది క్రీడాకారులు 25 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. కాకినాడలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2001 ఫిబ్రవరి 27 తర్వాత జన్మించిన వారై, 85 కేజీల లోపు బరువు ఉండాలని ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.



గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగించుకోవాలి



కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో యువకులను గుర్తించేందుకు ఇది మంచి అవకాశం. తెలుగు కబడ్డీ లీగ్ ఎంపిక పోటీలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగించుకోవాలి.

● చావిడి వెంకటేశ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

కబడ్డీలో కర్నూలు జిల్లాకు ప్రత్యేక స్థానం



కబడ్డీ క్రీడలో కర్నూలు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడల్లో రాణించాలి. తెలుగు కబడ్డీ లీగ్‌లో భాగంగా ప్రభుత్వం యువ క్రీడాకారులను ప్రోత్సహించి గుర్తించేందుకు ఇది మంచి అవకాశం.

● వలకలదిన్నె వెంకటేశ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, కర్నూలు

ఉరుకుంద క్షేత్రంలో శ్రావణమాస ఏర్పాట్లు



ఆలయ ముఖ ద్వారం

- పూర్తి చేసిన ఆలయ అధికారులు
- 25 నుంచి ఆగస్టు 23 వరకు ఉత్సవాలు
- లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం

కౌతాళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచే కాక కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు ఈ ఉత్సవాలకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిని ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్/ ఈవో మేడిపల్లి విజయరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. గతంలో కన్నా ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.



పూజలందుకుంటున్న స్వామివారి మూల విరాట్(ఫైల్)

శ్రావణమాసంలో నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంది. ఈనెల రోజుల్లో సోమ, గురువారాల్లో స్వామి వారి దర్శనానికి లక్షల్లో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయంలో 9ప్రదక్షిణలు 9వారాలు అన్న సెంటిమెంట్ ఉండటంతో ఆలయం లోపల చుట్టూ 9 ప్రదక్షిణలు చేసేందుకు వీలుగా శాశ్వత ప్రత్యేక బారికేడ్లను ఏర్పాట్లు చేపట్టారు. తిరుమల, శ్రీశైలం తరహాలో స్వామి దర్శనానికి ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వర్షం వస్తే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులు తడవకుండా రేకుల షెడ్లను నిర్మించారు. ఆలయ ప్రాంగణంలోనే గణపతి, లక్ష్మి అమ్మవార విగ్రహాలను తూర్పు ద్వారం వద్ద ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆలయం లోపల నవగ్రహాలు, శాశ్వత హోమ మండపం, లక్ష పుష్పార్చన కోసం ప్రత్యేక షెడ్లను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి రోజు వారి పూజలను చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో భక్తులకు తాగునీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



ఆలయం వెలుపల ఫుట్‌పాత్‌ల ఏర్పాటు

ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సంబంధించి ఈ ఏడాది ప్రత్యేకంగా ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100 టికెట్లను ఖరారు చేశారు. అదేవిధంగా వీఐపీ, వీవీఐపీ దర్శన ఏర్పాట్లు చేపట్టారు. వీఐపీ దర్శనంలో భాగంగా రూ.500తో శీఘ్రదర్శనం కల్పిస్తారు. రూ.1000తో స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పిస్తారు. ఆలయ వద్ద స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు రాత్రి సమయాల్లో కూడా అన్నదానం ఏర్పాట్లు చేపడుతున్నారు. అన్నదాన సత్రంలో ఒకేసారి దాదాపు రెండు వేలమంది భక్తులు భోజనం చేసేలా అన్నదాన సత్రాన్ని నిర్మించారు. ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు చేసే భక్తుల కోసం ప్రత్యేకఘాట్ల నిర్మాణం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ పరిసరాల్లో దాదాపు 180 సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. ఉత్సవాల్లో స్వామి దర్శనానికి 3వ సోమవారం 2లక్షల వరకు భక్తులు దర్శించుకునేలా ఏర్పాటు చేశారు. చివరి సోమవారం స్వామి పల్లకి ఉత్సవం కోసిగి మండలం కందుకూరు వద్ద ఉన్న తుంగభద్ర నదిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను జలాభిషేకం చేపట్టి ఆలయానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల ముగిసేంత వరకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు నెల రోజుల పాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.



స్వామి దర్శనం కోసం వేసిన గ్రిల్ బ్రిడ్జి

అటవీ శాఖలో రూ.4.37 కోట్ల అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

ఈ మొత్తాన్ని ప్రతిరోజు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పేరిట ఉన్న ఆత్మకూరు యూనియన్ బ్యాంకు ఖాతాలో జమచేసి నెలపూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని ఎఫ్‌డీపీటీ నంద్యాల పేరిట ఉన్న రాయలసీమ గ్రామీణ బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఆ విధంగా పంపించే చెక్కుల్లో చాంద్‌బాషా చేతివాటం ప్రదర్శిస్తూ కొన్ని చెక్కులను తన అవసరాలను మళ్లించుకున్నాడు. ఇందుకోసం తన కుటుంబీకులతో పాటు నేతాజీనగర్‌లోని మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకటశివయ్యను వాడుకున్నాడు. సుమారు రూ.4.37కోట్ల విలువ చేసే చెక్కులను వారి ఖాతాలకు పంపించి ఆ తర్వాత వివిధ మార్గాల్లో వాటిని డ్రా చేసుకుని అటవీశాఖ సొమ్మును కాజేశాడు. తాను పనిచేసినంత వరకు ఈ వ్యవహారం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అయితే ఆయన రిటైర్డు అయిన తర్వాత ఇక్కడకు బదిలీపై వచ్చిన ఏవో రాజు రికార్డులు తనిఖీలు చేయగా పలు అవకతవకలు వెలుగు చూశాయి. పూర్తిస్థాయిలో పరిశీలించగా చెక్కుల స్వాహా బాగోతం బట్టబయలైంది. దీంతో ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సైతం విచారణ చేపట్టి ఈ కేసులో ఇప్పటివరకు ఏడుగురుని నిందితులుగా గుర్తించారు. వీరిలో ప్రస్తుతం ఇద్దరు మగ్బూల్‌బాషా, వెంకటశివయ్యలను మంగళవారం నంద్యాల రస్తాలో అరెస్టు చేయగా మరో ఐదుగురిని అరెస్టు చేయాల్సి ఉంది. ఇదిలావుంటే నిందితులకు చెందిన సుమారు రూ.2.5కోట్ల గల ఆస్తులను కూడా ప్రభుత్వానికి అటాచ్ చేసే ప్రక్రియ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో చాంద్‌బాషా అరెస్టులో జాప్యం

హైకోర్టు ఉత్తర్వుల కారణంగానే చాంద్‌బాషా అరెస్టు జాప్యమైనట్లు పోలీసులు తెలిపారు. వాస్తవానికి అటవీ శాఖ సొమ్ము వ్యవహారంలో తొలుత అటవీశాఖ అధికారులు రూ.19.25లక్షలు మాత్రమే అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన చాంద్‌బాషా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశాడు. అయితే ఆ తర్వాత తీగ లాగితే డొంక కదిలినట్లు చాంద్‌బాషా అక్రమాలు రూ.4.37కోట్ల వరకు చేరింది. కానీ తాను వాడుకున్న రూ.19.25లక్షలను తిరిగి చెల్లించానని, తన వయస్సు రీత్యా పోలీసులు తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని చాంద్‌బాషా హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో చాంద్‌బాషాను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చాంద్‌బాషా స్వాహా చేసింది రూ.19.25లక్షలు కాదని.. రూ.4.37కోట్లు అని.. ఇది పెద్ద కుట్ర అని పోలీసులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇప్పటికే ఈ పిటీషన్లపై పలు వాదనలు జరిగాయి. హైకోర్టు నుంచి క్లియరెన్స్ రాగానే ప్రధాన నిందితుడైన చాంద్‌బాషాను అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

అధికారుల నిర్లక్ష్యంపై అన్ని కోణాల్లో దర్యాప్తు

15 ఏళ్ల పాటు ఒకే కార్యాలయంలో తిష్టవేసి కోట్ల రూపాయలు కాజేస్తున్నా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కూడా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఈ అక్రమాలపై అమరావతి నుంచి అటవీశాఖ వారు ప్రత్యేక కమిటీని నియమించగా పోలీసులు కూడా తమదైన శైలిలో విచారిస్తున్నారు. ప్రత్యేకించి అటవీ శాఖ, యూనియన్ బ్యాంకు, ఆడిట్ అధికారుల నిర్లక్ష్యంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజినాయక్ వెల్లడించారు. అలాగే బ్యాంకు లావాదేవీలకు సంబంధించి యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్‌కు కూడా పలు నివేదికలను కోరినట్లు స్పష్టం చేశారు. ఇందులో బ్యాంకు అధికారులు తప్పిదాలపై కూడా పోలీసులు విచారిస్తున్నారు.

వైభవంగా సత్యసాయి బాబా రథోత్సవం



సత్యసాయి రథం వద్ద పూజలు చేస్తున్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో పుట్టపర్తి సత్యసాయి బాబా రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. నంద్యాల జిల్లా ఆత్మకూరు మీదుగా మంగళవారం ఉదయం కర్నూలు చేరుకున్న బాబా రథాన్ని పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠం వద్ద ప్రత్యేక పూజలు చేసి నగరంలో శోభాయాత్ర ప్రారంభించారు. లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి రథానికి, సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో రథాన్ని ప్రారంభించారు. మహిళా భక్తులు వందలాదిగా తరలి వచ్చి, కలశాలతో రథం ముందు సాయి నామస్మరణతో పాల్గొన్నారు. చిన్నారుల సంప్రదాయ నృత్యాలతో రథోత్సవానికి స్వాగతం పలికారు. రథోత్సవం పాతనగరంలోని జమ్మిచెట్టు వీధి మీదుగా వన్‌టౌన్, ఇస్కాల సత్రం, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, అంబేడ్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు, మున్సిపల్ ఆఫీసు, ప్రకాశ్‌నగర్ మీదుగా నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరానికి చేరుకుంది. అక్కడ జరిగిన పూజల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఎస్‌బీఐ కాలనీ, అశోక్‌నగర్, ఏపీ టూరిజం హోటల్, రామలింగేశ్వర్‌నగర్, వెంకటరమణ కాలనీ, శివరామాలయం మీదుగా సూర్యనారాయణ స్వామి ఆలయం చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం కృష్ణనగర్, ఐటీసీ మీదుగా రాగమయూరి కాలనీకి చేరుకుంది. ఈ కార్యక్రమాల్లో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కృష్టారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సాయిబాబా, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సీనియర్ సేవాదళ్ ప్రతినిధులు పట్టాభిరామయ్య, సూర్యనారాయణ రెడ్డి, భజన మండలి కన్వీనర్ సందీప్‌కుమార్, మహిళా సేవాదళ్ ప్రతినిధులు లక్ష్మీ సరోజ, సంధ్య, శారద పాల్గొన్నారు.



పాతనగరంలో రథానికి ముందు కలశాలతో మహిళా భక్తుల ర్యాలీ

కూతురికి అన్నీ తానై..



లక్ష్మీదేవికి అన్నం తినిపిస్తున్న తల్లి

- వింత వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీదేవి
- 49 ఏళ్లుగా సపర్యలు చేస్తున్న తల్లి
- గత వైసీపీ హయాంలో పింఛన్ తొలగింపు
- కలెక్టర్ గారూ.. పింఛన్ ఇప్పించాలని మనవి

అమ్మ గొప్పతనం మాటల్లో చెప్పలేనిది. ఆమె ప్రేమ, త్యాగం, ఆప్యాయత, అనురాగం అన్నీ అమూల్యమైనవి. అమ్మ తన బిడ్డల కోసం తన జీవితాన్నే త్యాగం చేస్తుంది. బిడ్డ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడుతోంది. అమ్మ ప్రేమ, ఆప్యాయత వెలకట్టలేనిది. ఇలాంటి మాతృమూర్తి తన బిడ్డ కోసం అహర్నిశలు శ్రమచేస్తూ ఆమెకు సపర్యలు చేస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 49 ఏళ్ల వయస్సు ఉన్న కన్న కూతురిని కంటికి రెప్పల్లా కాపాడుకుంటోంది. వింత వ్యాధితో బాధపడుతున్న కుమార్తె కోసం అన్నీ తానై సేవలందిస్తోంది. ఇలాంటి తల్లికి ప్రస్తుతం ఆర్థిక భారం వెంటాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కుమార్తెకు వచ్చే పింఛన్‌ను తొలగించింది. దీంతో కూటమి ప్రభుత్వమైనా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంటోంది.

కోవెలకుంట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 49 ఏళ్ల కూతురుకు ఆ తల్లి అన్నీ తానై సేవలందిస్తోంది. కూతురు పేరుకు మాత్రమే జీవించినా భోజనం, స్నానం, మలమూత్రాలు వచ్చినా ఎలాంటి కదలిక ఉండదు. బంధువులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పద్మావతిబాయి, నరససింగరావు దంపతులు. వీరికి వెంకటరమణ, లక్ష్మీదేవి అనే పిల్లలు ఉన్నారు. వెంకటరమణ ప్రస్తుతం పెళ్లి చేసుకొని వేరే కాపురం పెట్టాడు. అయితే లక్ష్మీదేవి పుట్టకతోనే వింత వ్యాధితో జన్మించింది. ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా జీవనం సాగిస్తోంది. అలాంటి కూతురికి తల్లి పద్మావతి బాయి అన్నీ తానై చూసుకుంటోంది. పద్మావతి బాయి భర్త నరసింగరావు క్రిష్టిపాడులోని పశువైద్యశాలలో అటెండరుగా పనిచేస్తూ 2013లో పదవీ విరమణ చేశారు. 2014లో తల్లి నుంచి కూతురు వేరై రేషన్‌కార్డు కూడా పొందడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూతురు లక్ష్మీదేవికి పింఛను మంజూరుచేసింది. కూతురు పింఛనుతో జీవనం సాగిస్తుండేవారు. 2020 మార్చి 5న భర్త నరసింగరావు అనారోగ్యంతో మృతి చెందడంతో భర్తకు వచ్చే పెన్షన్ భార్య పద్మావతికి మంజూరు చేసింది. తల్లికి రూ.12వేలు, కూతురుకు రూ.2వేలు పింఛను వస్తుండేది.



లక్ష్మీదేవి

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లతో సర్వే చేయించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించడంతో తల్లికూతురు ఒకే ఇంట్లో ఉండడంతో తల్లికి ప్రభుత్వ పింఛను రూ.12వేలు వస్తుండడంతో కూతురు అర్హులైనప్పటికీ ప్రభుత్వం పింఛను తొలగించింది. తల్లికి వచ్చే పింఛనుతోనే ఆసుపత్రి, భోజనాలకు కాలం వెళ్లదీస్తుండే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఇటీవల కొత్తపింఛన్లు మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అన్ని అర్హతలు ఉండి కూడా ఎలాంటి పింఛనుకు నోచుకోకుండా లక్ష్మీదేవి తీవ్ర ఇబ్బందులు పడుతుంది. కలెక్టరు స్పందించి విచారణ జరిపించి అర్హురాలైన లక్ష్మీదేవికి రూ.6వేలు పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా మారడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పల్లె ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చాగలమర్రి మండలం గోడిగెనూరు గ్రామానికి చెందిన పల్లె ప్రసాద్ తండ్రి నరసింహుడు, తమ్ముడు సుభాష్ 2017లో హత్యకు గురయ్యారు. ఇందులో నష్టపరిహారంగా మృతుడు సుభాష్ భార్యకు కొంత డబ్బు ఇచ్చి గ్రామపెద్దలు పంచాయితీ చేశారు. అయితే ఇప్పుడు అదే కేసు విషయంలో సుబ్బరత్నమ్మ డబ్బు కోసం పోలీసులను ఆశ్రయించిందన్నారు. డబ్బు కోసం తనను రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ స్టేషన్‌కు పిలిపించి, అందరి ముందు అవమానించడంతో పాటు చెప్పిన మాట వినకుంటే కేసు పెడతానని బెదిరిస్తున్నాడని పల్లె ప్రసాద్ ఆరోపించాడు. తనపై పోలీసులు ఒత్తిడితెచ్చి రూ.8 లక్షలు అప్పు ఉన్నట్లు బాండ్‌పై సంతకం పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దిక్కుతోచని స్థితిలో ఎస్పీ కార్యాలయం సమీపంలో పురుగు మందు తాగినట్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వివరించాడు. దీంతో అక్కడున్న వారు ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

న్యాయం చేయాలి: బాధితురాలు

చాగలమర్రి మండలం గోడిగెనూరు గ్రామానికి చెందిన సుబ్బరత్నమ్మ తన భర్త సుభాష్ హత్య కేసుకు సంబంధించి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఆళ్లగడ్డలో మంగళవారం రాత్రి బాధిత మహిళ సుబ్బరత్నమ్మ మీడియాతో మాట్లాడుతూ 2017లో గోడిగెనూరు గ్రామంలో తన భర్త సుభాష్, మామ నరసింహులను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హత్య చేశారన్నారు. ఈ కేసు విషయంలో తనతోపాటు తన బావ అయిన పల్లె ప్రసాద్ సాక్షులుగా ఉన్నామన్నారు. కాగా, తన బావ ప్రసాద్ డబ్బుకి ఆశ పడి తనను కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పకుండా చేసి నిందితులతో రాజీ చేసి భారీ మొత్తం నగదును తీసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్లిన తనపై నానా దుర్భాషలాడి బయటకు గెంటివేశారన్నారు. ఈ విషయంపై తాము గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా ఎస్పీ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తనని పిలించి విచారణ చేశారని బాధితురాలు సుబ్బరత్నమ్మ తెలిపారు. దాంతో బావ ప్రసాద్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి డ్రామాలు ఆడుతున్నారని బాధితురాలు వాపోయారు. ఇందులో పోలీసుల ప్రమేయం లేదని తెలిపారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరార

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెలుం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(45) కొన్నేళ్లుగా మద్యానికి బానిసైయ్యాడు. దీంతో తన జీవితంపై విరక్తి చెంది పేడరంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అవుకు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

ఆస్పరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన అనిత(35) కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. వివరాల మేరకు.. జూన్ 15న కడుపునొప్పి రావడంతో మహిళను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా అక్కడ మృతి చెందిందన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మైనర్లపై కత్తితో వ్యక్తి దాడి

నంద్యాల టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎన్జీవో కాలనీకి చెందిన అంజి అనే వ్యక్తి తన కూతురు వెంట పడుతున్నారని మైనర్లైన ఇద్దరిపై కత్తితో మంగళవారం దాడి చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు.. సాయంత్రం ఆదే కాలనీలో వెళ్తూ కనిపించడంతో కొందరు వారే మీ అమ్మాయి వెంట పడుతున్నారని చెప్పడంతో వెంటనే దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య

- తమ్ముడితో కలిసి భర్తను చంపిన భార్య
- పిడుగురాళ్లలో ఘటన
- మృతుడు నంద్యాల పట్టణ వాసి



రమణయ్య (ఫైల్)

నంద్యాల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య తన తమ్ముడితో కలిసి భర్తనే దారుణంగా హత్య చేయించింది. ఈ ఘటన పిడుగురాళ్లలో చోటుచేసుకోగా మృతదేహాన్ని నంద్యాలకు తీసుకువచ్చి ఇక్కడ వేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నూనెపల్లెకు చెందిన రమణయ్య(50)కు పిడుగురాళ్లకు చెందిన రమణమ్మతో ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు వచ్చాయి. రెండు నెలల క్రితం రమణమ్మ పుట్టింటికి వెళ్లింది. భర్త రమణయ్య రెండు రోజుల క్రితం భార్యతో మాట్లాడి ఇంటికి తీసుకురావడానికి వెళ్లారు. సోమవారం రాత్రి అతడు మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. దీంతో భార్య బావమర్ది రామయ్యతో కలిసి రమణయ్య కంట్లో కారంపొడి చల్లి దారుణంగా హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మృతదేహాన్ని పిడుగురాళ్ల నుంచి నంద్యాలకు తీసుకువచ్చారు. భర్త ఇంటి వద్ద మృతదేహాన్ని వదిలేసి వెళ్లారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నంద్యాలలో పెయింటింగ్ పని చేసేవాడు. పిడుగురాళ్ల స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సులో ఊపిరాడక విద్యార్థులకు అస్వస్థత

- ఒకే బస్సులో 235మంది విద్యార్థులు, ప్రయాణికులు



అస్వస్థతకు గురైన విద్యార్థులు

దేవనకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లే ఆర్టీసీ బస్సులు పరిమితికి మించి ప్రయాణికులు ఉండటంతో ఊపిరాడక విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బస్సు కండక్టర్ లక్ష్మన్న వివరాల మేరకు.. మంగళవారం దేవనకొండ నుంచి జిల్లెలబుడకల గ్రామానికి బయలుదేరింది. బస్సులో 235 మంది విద్యార్థులు, 7 మంది ప్రయాణికులు ఉన్నారు. పరిమితికి మించి ఎక్కడంతో మండలంలోని ఓబులాపురం వద్దకు రాగానే జిల్లెలబుడకల గ్రామానికి చెందిన కౌసిక్ (3వ తరగతి), యశ్వంత్ (3వతరగతి), కార్తిక్(2వ తరగతి), ఓబులాపురం గ్రామానికి చెందిన మేఘనాథ్(1వ తరగతి) ఉపిరాడక అస్వస్థకు గురై బస్సులోనే కుప్పకులారు. గమనించిన పిల్లలు కేకలు వెయ్యడంతో హంద్రీ కాలువ వద్ద బస్సుని ఆపి విద్యార్థులను వెంటనే కిందకు దించి సపర్యలు చేయడంతో పిల్లలు కోలుకున్నారు. దేవనకొండలోని పాఠశాలకు వెళ్లే సమయంలో బస్సు లేకపోవడంతోనే ఇలా పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లెలబుడకల, ఓబులాపురం, మాదాపురం, పల్లెదొడ్డి, గద్దెరాళ్ల గ్రామాల విద్యార్థులకు రోజూ ఇలా ఇబ్బందులు తప్పడం లేదని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సుని ఏర్పాటు చేయాలని జనసేన నాయకుడు కృపాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

దివ్యాంగులకు అండదండలు అందిస్తాం

- డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు
- ఘనంగా డీఈఎఫ్ ఆవిర్భావ వేడుకలు



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అండదండలు అందించడమే తమ ధ్యేయమని డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు అన్నారు. మంగళవారం నగరంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో దివ్యాంగుల సాధికారత ఫోరం (డీఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బీసీ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.నాగరాజుగౌడ్, దివ్యాంగుల ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ క్రిష్ణుడు, టీడీపీ దివ్యాంగుల సేవా విభాగం సెక్రటరీ నీలా జోజిబాబు, డీఈఎఫ్ ప్రధాన కార్యదర్శులు ఎం. శివశంకర్, కె.ఈరన్న, ఉపాధ్యక్షుడు కమతం వెంకటేశ్, కోశాధికారి ఆదిశేషయ్య, సలహాదారుడు రామాంజనేయులు మాట్లాడారు. దివ్యాంగుల సాధికారిత కోసం, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎప్పుడూ వెన్నంటి ఉంటామని చెప్పారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేలా వారికి తగిన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. దివ్యాంగులకు సంబంధించిన సామాజిక హక్కుల, చట్టాల, రాయితీ రిజర్వేషన్ల కోసం తమ సంస్థ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, ఇటు దివ్యాంగులకు ఒక వారధిగా నిలుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు డీఈఎఫ్‌ను బలపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల డీఈఎఫ్ కార్యవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేయాలి



వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు

- ఆదోనిలో రైతుల ఆందోళన
- రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అగ్రికల్చర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తమకు వెంటనే యూరియా పంపిణీ చేయాలని పెద్ద హరివాణం, సంతేకూడ్లూరు, జే హోసల్లి, పాండవుగల్లు, నాగనాతహళ్లి, గణేకల్లు తదితర ప్రాంతాల రైతులు డిమాండ్ చేశారు. మంగవారం మండల వ్యవసాయ కార్యాలయం డీసీఎంఎస్ కేంద్రానికి చేరుకున్న రైతులకు స్టాక్ లేదని అధికారులు చెప్పడటంతో కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వర్షాలు కురవడంతో పత్తి, వేరుశనగ, వరి పంటకు యూరియా అవసరమని ఈ సమయంలో యూరియా లేదంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రైవేటు డీలర్లు యూరియాకు లింకు అంటగట్టి అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ఏవో సుధాకర్ చేరుకొని ప్రైవేటు డీలర్ల దగ్గర ఉన్న యూరియాకు పర్మిట్లు రాసి పంపించేశారు. గ్రామాల్లో రైతు కేంద్రాలలో రైతులకు అవసరమైన యూరియా ఉందని ఇక్కడ వరకు రావద్దంటూ సూచించారు. కాగా డీసీఎంఎస్ కేంద్రానికి సాయంత్రం లారీలు రావడంతో పంపిణీ చేశారు.

యూరియా కొరత రాకుండా చూస్తా : ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హామీ ఇచ్చారు. మంగళవారం మార్కెట్ యార్డ్‌లోని డీసీఎంఎస్ వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఎరువుల కొరతపై ఏవో సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు రోజుల కొసారి రైలులోఎరువు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినా, లింకు అంటగట్టినా దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, వ్యవసాయ శాఖ ఏడీ బాలవర్ధని రాజు, ఏవో సుధాకర్, డీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

అధికారులపై కేంద్ర బృందం అసహనం

- రికార్డుల నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం



గోవిందపల్లెలో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు



వెలుగు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్న లీడర్

ఉయ్యాలవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై కేంద్ర బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం టీమ్ లీడర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం పరిశీలించింది. ఈ మేరకు గోవిందపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో అధికారులు పర్యటించారు. గోవిందపల్లె గ్రామంలో పర్యటించి 2022-25 సంవత్సరాల్లో ఉపాధి హామీలో జరిగిన పనులు, వాటి ఫైళ్లు, ఎంబుక్‌లను తనిఖీ చేశారు. గ్రామంలోని ఓ రైతు నిర్మించుకున్న గోకులం షెడ్డుకు సంబంధించిన రూ.50 వేల మెటీరియల్‌కు బిల్లు చూపాలని స్థానిక అధికారులను అడిగారు. దీంతో ఆ రికార్డులు తమ వద్ద లేవని కార్యాలయంలో ఉన్నాయంటూ వారు బుకాయించారు. దీంతో కేంద్ర అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆర్.జంబులదిన్నె గ్రామంలో గ్రామైక్య సంఘ మహిళలతో మాట్లాడుతూ తమ విధులను వివరించాలని అడిగారు. దీంతో వారి నుంచి సరైన సమాధానం రాలేదు. గ్రామైక్య సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చారా? లేదా? అని అధికారులను ప్రశ్నించారు. పొదుపు రుణాలపై ఆరా తీశారు.

వీవో రికార్డులు చూపని వెలుగు సిబ్బంది

కేంద్ర బృందం వారు అడిగిన వీవో రికార్డులను వెలుగు సిబ్బంది, అధికారులు చూపలేకపోయారు. గతంలో పని చేసిన వీవోఏను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తొలగించామని, తొలగించిన వీవోఏ రికార్డులను తమకు అప్పగించలేదన్నారు. కొత్తగా వచ్చిన వీవో మినిట్స్, క్యాష్ బుక్ చూపించాలన్నారు. అందులో కేవలం రెండు మీటింగ్స్ మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. క్యాష్ బుక్‌కు బదులుగా 2011 బ్యాంక్ స్టేట్ మెంట్ చూపారు. 2011 నుంచి ఇప్పటి వరకు వీవో లావాదేవీలే జరగలేదా? అని ప్రశ్నించారు. అలాంటప్పుడు వీవోఏలకు జీతాలు ఏవిధంగా ఇస్తున్నారన్నారు. దీంతో సమాధానం చెప్పలేకపోయిన మండల అధికారులు నీళ్ల నమిలారు.

ఎమ్మెల్యే చెబితే నలుగురిని తొలగించాం

ఎమ్మెల్యే చెబితే మండలంలోని నలుగురు వీవోఏలను తొలగించామని వెలుగు ఏపీఎం దాసన్న కేంద్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఆర్.జంబులదిన్నె, ఆర్.పాంపల్లె, తుడుమలదిన్నె, పెద్దయమ్మనూరు వీవోఏలను ఏప్రిల్ నెలలో తొలగించి కొత్త వారిని నియమించామన్నారు. రికార్డులు తమకు అప్పగించటం లేదని కేంద్ర బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్రం డీఆర్డీఏ పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సభ్యులు సూర్యకంటప్రధాన్, డ్వామా పీడీ సూర్యనారాయణ, ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పీఆర్ ఏఈ వెంకటయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణ, ఏపీవోలు హరికృష్ణ, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగెకరాలు.. గంటన్నరలో పంట కోత



వేరుశనగ పంట కోత కోసిన వాల్మీకి నగర్‌కు చెందిన యువకులు

పంట కోతను కోయడంలో ఆ గ్రామానికి చెందిన కూలీలు దిట్ట. ఏ పంటనైనా గంటల్లో కోసేయగలరు. మండల కేంద్రమైన కోసిగిలోని మూడో వార్డు వాల్మీకినగర్‌కు చెందిన 19 మంది యువకులు నాలుగెకరాల వేరుశనగ పంటను గంటన్నర వ్యవధిలోనే కోసేసి భళా అనిపించుకున్నారు. కోసిగికి రైతు ఈరన్న పొలంలో మంగళవారం ఉదయం 6గంటలకే వేరుశనగ పంటను కోసేందుకు యువ కూలీలు సిద్ధమయ్యారు. అందరూ కలిసి ఉదయం 7:30గంటలకు పూర్తి చేశారు. గతంలో కూడా ఈ యువకూలీలు పోటీ పడి వేరుశనగ పంటను సమయం చెప్పి కోశారు. గతంలోనూ ఉన్న రికార్డు కంటే తక్కువ సమయంలోనే ఈసారి పంట కోసి ఘనత సాధించారు.

● కోసిగి, ఆంధ్రజ్యోతి

జీజీహెచ్‌ను పరిశీలించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్



గైనిక్‌వార్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

కర్నూలు హాస్పిటల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మంగళవారం రాత్రి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పరిశీలించారు. ఆసుపత్రిలో విభాగాలతో పాటు సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను చైర్‌పర్సన్ సందర్శించారు. అక్కడ బాధిత మహిళలతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకుని ఓదార్చారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మహిళల భద్రతకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలను ఆదుకోవడంలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సఖీ వన్ స్టాప్ సెంటర్లను నిర్వహించడం జరుగుతోందన్నారు. బాధిత మహిళలకు మహిళా పోలీస్ స్టేషన్‌లో సమన్వాయం చేసుకుని వారిని రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం గైనిక్ విభాగాన్ని సందర్శించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాల, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు చెల్లించండి

- పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ శబరి

నంద్యాల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతులు పెండింగ్ క్లెయిమ్‌ల కోసం ఎదురు చూస్తున్నారని, వాటిని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జీరో అవర్‌లో ఎంపీ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు జాతీయ స్థాయిలో నివేదించబడిన క్లెయిమ్‌లలో 2020-21, 23,24 సంవత్సరాల మధ్య రూ76,965 కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అయితే ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. రూ.2,398 కోట్ల క్లెయిమ్‌లకు గానూ రూ.567 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. మిగతా రూ.1,800 కోట్ల క్లెయిమ్‌ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని వివరించారు. సకాలంలో పూర్తి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోళ్ల దాణ లారీ బోల్తా

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో దాణ లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. మంగళవారం మహారాష్ట్ర నుంచి సేలంకు కోళ్ల దానాతో వెళ్తున్న లారీ అదుపు తప్పింది. అయితే ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం జరగలేదు డ్రైవర్‌కు కూడా గాయాలు కాలేదు. తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు యూట్యూబర్లపై ఫిర్యాదు

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు యూట్యూబ్ చానల్ నిర్వాహకులపై సర్వేయర్ జగదీష్ డీఎస్పీ శ్రీనివాసులుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 19న సర్వేయర్ కార్యాలయంలో విధులకు ఆటంకం కలిగిస్తూ ఫొటోలు, వీడియోలు తీసి వేధింపులకు గురిచేసినట్లు సర్వేయర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పంటల బీమా చేయించుకోవాలి



తర్తూరులో ఎరువులను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు చేసుకుని పంట బీమా తప్పకుండా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తర్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి మంజూరైన ఎరువులను రైతుసేవ కేంద్రంలో రైతులకు అందజేశారు. 31లోపు పంట నమోదు పత్రం పొంది బీమా చేయించుకోవాలని సూచించారు. రైతులు ఎక్కువ మోతాదులో ఎరువుల వాడకం తగ్గించాలని, యూరియా అన్నిగ్రామాల సేవకేంద్రాలకు వస్తుందని రైతులు గమనించాలని సూచించారు.

ఏడీఏ, ఏవోలకు సన్మానం



పాములపాడులో ఏడీఏ, ఏవోను సన్మానిస్తున్న డీలర్లు

పాములపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీపై వెళ్తున్న ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ, పాములపాడు మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డిలను డీలర్ల అసోసియేషన్ మధు, చంద్రశేఖర్‌గౌడ్ అధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీ, ఏవో మాట్లాడుతూ గత ఐదేళ్లలో మండలంలోని రైతులు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో కలసి మెలసి పని చేశామని, సాధారణ బదిలీలో భాగంగా బదిలీపై వెళ్లడం బాధగా ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, సీనియర్ డీలర్లు రామస్వామి, కిరణ్‌గౌడ్, శ్రీనివాసులు, సన్ని, శివరామయ్య, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌లో నాణ్యమైన సేవలు

పాములపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని పోస్టల్ కార్యాలయంలో అందిస్తున్న నాణ్యమైన సేవలు ప్రజలు వినియోగించుకోవాలని పోస్టుమాస్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మరింత చేరువ అయ్యేందుకు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఐటీ 2.0 సాఫ్ట్‌వేరును అందుబాటులోకి తీసుకొచ్చిందని, దీంతో నాణ్యమైన సేవలు అందుతాయని తెలిపారు.

బోనాల జాతరకు సర్వం సిద్ధం



ముస్తాబైన ఆలయం

ఆత్మకూరు, జూలై 22(ఆంధ్ర జ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో వెలసిన చౌడేశ్వరీ దేవస్థానంలో ఆషాడ మాసం అమవాస్య తిథి, గురువారం అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బోనాల జాతరను సంబరంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తెలంగాణ ప్రాంతాల్లో జరిగే బోనాల పండుగలను గత కొన్నేళ్లుగా ఆత్మకూరులో కూడా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో గణపతిపూజ, క్షీరాభిషేకం, సహస్ర కుంకుమార్చన, నవగ్రహహోమం, పూర్ణాహుతి, కూష్మాండబలి దానం, తొట్లోత్సవం వంటి పూజాక్రతువులను చేపట్టనున్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బండి ఆత్మకూరు జూలై 22(ఆంధ్ర జ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నియోకవర్గ సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కడమల కాల్వ, బండిఆత్మకూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి కూటమి వైఫల్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ సంజీవరెడ్డి. శశికళారెడ్డి, సుజాతమ్మ, మండల వైసీపీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాగాల బాబుల్, రమణ. వెంకటేశ్వర్లు, అవుటాల నాగేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, దీప్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో కూటమి విఫలం

గడివేముల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో కూటమి విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మధుసూదన్‌గుప్తా, జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, మాజీ సర్పంచ్ శివానందరెడ్డి, రఘు, మాధవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ బాల్, చిన్ని పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేస్తాం

నంద్యాల రూరల్, జూలై(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీపీఐ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పాళ్ల నాగేశ్వరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ. 31న డోన్‌లో జరిగే నంద్యాల జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఆగస్టు 23 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహా సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్లును విడుదల చేశారు.సమావేశంలో నాయకులు రామంజనేయులు, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనంరాఆమనారాయణరెడ్డి



మంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రిఫరూక్, ఎమ్మెల్యే గౌరు చరిత

సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తాం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

గడివేముల, జూలై 22(ఆంధ్రజ్యోతి): దుర్వేశి గ్రామంలో సుంకులమ్మ ఆలయాన్ని నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దుర్వేశిలో 'తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి స్వయంగా హాజరవుతానని గ్రామస్థులతో చెప్పారు. ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.36కోట్లు, గోరుకల్లుకు రూ.96కోట్లు నిధులు మంజూరుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం నియోజకవర్గ అబ్జర్వర్ గాజుల ఆదెన్న, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, మార్కెట్‌యార్డు చైర్మన్ గీత, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, దిలీప్ కుమార్‌రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, రఫిక్, మాజీ సర్పంచ్ జమాల్ బాషా, గిరిబాబు, ఈశ్వర్‌రెడ్డి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఆనంని కలిసిన మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్: దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి మంగళవారం నంద్యాలకు వచ్చారు. రాష్ట్ర మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ నాయకులు కలిసి పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణకు నిధులు మంజూరు

గోస్పాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో జీర్ణోద్ధరణకు చేరుకున్న ఆలయాలకు ప్రభుత్వం రూ.1.76కోట్లు మంజూరు చేసింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం నంద్యాలకు రావడంతో మండలం నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వక్ఫ్, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వర రెడ్డి, గంగుల వెంకటరెడ్డి, జూపల్లె రామగోపాల్‌రెడ్డి, గ్రామపెద్దలు మంత్రి ఆనంని ఘనంగా సత్కరించారు.

అర్చకులకు 10వేల పారితోషికం చెల్లించాలని వినతి

నంద్యాల కల్చరల్: మున్సిపాలిటీల పరిధిలోని ప్రైవేటు ఆలయాలలో పనిచేసే అర్చకులకు రూ.10వేలు పారితోషికం ఇవ్వాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్దుతాం

- మంత్రి ఫరూక్ కల నెరవేరేలా ప్రణాళికలు
- పాఠశాలను సందర్శించిన కలెక్టర్ రాజకుమారి



పాఠశాలలో డీఈవోతో చర్చిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చదువుకున్న పాఠశాలను రాష్ట్రంలోనే అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టర్ పాఠశాలను పరిశీలించారు. మంత్రి చిన్ననాటి గుర్తుగా మిగిలిపోయిన తాను విద్యను అభ్యసించిన బైర్మల్‌వీధి(గుర్రాలపేట)లోని కాదరబాద్ నరసింగరావ్ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను తన జీవితాంతం గుర్తిండిపోయేలా అభివృద్ధి చేయాలని పూనుకున్నారు. పాఠశాలలో గదులు, డ్రైనేజి వ్యవస్థ, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేసే విధంగా అధికారులను ఆదేశించారు. అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజనీర్లను కోరారు. పాఠశాల ఆవరణలో పేరుకపోయిన మట్టిదిబ్బలను నెలరోజుల లోపు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో జనార్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుశ్శేన్, మున్సిపల్ ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

తెలుగుతల్లి ఉద్యానవనం పరిశీలన

నంద్యాల శ్రీనివాసనగర్‌లోని తెలుగుతల్లి ఉద్యానవరం పార్కును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. పార్కులో వర్షపు నీరు నిలిచివుండడంతో వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క చుక్క నీరు నిల్వ ఉండకుండా చేయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ఆదేశించారు. సందర్శకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెంచీలు సరిగా లేవని, శుభ్రం చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో పార్కు సిబ్బందిని పిలిచి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని, సందర్శకులకు సరిపడా బెంచీలు, మరుగుదొడ్లు నిర్మించాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి



దామగట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ గిరీష్ తెలిపారు. మంగళవారం మండలంలోని యదామగట్ల, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ఈ పంట నమోదును పరిశీలించారు. అలాగే రైతుల పొలాల లోని మొక్కజొన్న, కంది, ఉల్లి, పచ్చిమిరప పంటలను మండల వ్యవసాయాధికారి షేక్షావలి, రైతు సేవాకేంద్రం సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి పంట పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్షావలి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ ఉప సర్పంచ్ ఏసురత్నం రైతులు పాల్గొన్నారు.

జగజ్జననీ అమ్మవారికి చీర సారె సమర్పణ

నంద్యాల కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు మంగళవారం జగజ్జననీ మాతకు చీరె సారె సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రంలో భాగంగా ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

వెలుగోడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు పాటించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సతీమణి బుడ్డా శైలజ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వెలుగోడు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పౌష్టికాహారం, వ్యాయమం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్టు వృషాలి యోగా నిపుణురాలు మాదవి, ఐసీడీఎస్ సీడీపీవో నిహారిక మాజీ ఎంపీపీలు చంద్ర సీతాలక్షమ్మ, అన్నారపు సీతమ్మ, ఎల్లా క్రిష్ణుడు, చంద్రా రాజశేఖరరెడ్డి, రాఘవయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

మహానంది, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డీవీఎంసీ సభ్యుడు దవనాల రవికాంత్‌బాబు అన్నారు. మంగళవారం మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ రాయుడులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై సమీక్ష

కొత్తపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల అభివృద్ధిపై ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కొత్తగా మండలానికి బదిలీపై వచ్చిన సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. క్షేత్రస్థాయిలో అప్పగించిన సర్వే పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పార్థసారధి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

కొత్తపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి భక్తి భావాలను అలవర్చుకోవాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి డా.మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నందికుంట గ్రామంలోని నందీశ్వరస్వామి దేవస్థానంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజాదాస్ ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైరెడ్డి నిత్యలక్ష్మి, అర్చకులు బానాల లక్ష్మినారాయణ ఆచార్యులు గ్రామ నాయకులు నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, బృందం సభ్యులు నారాయణ, శివన్న, పుల్లయ్య, మహేష్, ప్రవీణ్, హేమంత్‌సాయి, రామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

మిడుతూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం గ్రామానికి చెందిన 200 మంది కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర నివాసంలో వారికి టీడీపీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నడిపి నాగన్న, మాజీ సర్పంచు హుశేనయ్య శ్రీరాములు, కృష్ణ స్వామి, బాల స్వామి, నడిపి సుల్తాన్, నక్కలి స్వామన్న, ఆంటోని, వీరన్న పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం అగ్రనేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ (102) మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏసురత్నం, సీనియర్ నాయకులు రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం అచ్యుతానందన్ మృతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నరసింహానాయక్, సుధాకర్, రజాక్, మాబాషా, రామ్‌నాయక్, ముర్తుజా, పుల్లయ్య, శీను, జబీవుల్లా ఉన్నారు.

నంద్యాల రూరల్: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ పోరాటాల యోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ కొనియాడారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికిపూల మాల వేసి నివాళులు అర్పించారు.

మహిళా సాధికారత సదస్సులో ఆర్జీఎం విద్యార్థినులు

పాణ్యం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆర్జీఎం విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. నంద్యాలలో మంగళవారం ఏపీ రాష్ట్ర మహిళా కమీషన్ నిర్వహించిన మహిళల హక్కులు, సంక్షేమం అంశంపై జరిగిన చర్చల్లో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారన్నారు. మహిళల హెల్ప్‌లైన్‌లు, ప్రభుత్వ పథకాలు, మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై సదస్సులో చర్చించారన్నారు. ఈ సదస్సులో కలెక్టరు రాజకుమారి గణియా, కమీషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ,ఏఎస్పీ జావళి అల్ఫాన్స్, అధ్యాపకులు శాంతల, శ్వేత, శక్తీకరణ సెల్ కోఆర్డినేటర్ హరిత పాల్గొన్నారన్నారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి: సీపీఎం

జూపాడుబంగ్లా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించడంవల్ల ప్రజలపై అధికంగా విద్యుత్ చార్జీలు పడతాయని వాటిని ప్రజలు తిరస్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, కర్ణ అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లాలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు అధికారం చేపట్టాక కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, గోపాలకృష్ణ, రవి, మద్దిలేటి, శివ, దేవరాజు, తిరుపతి పాల్గొన్నా రు.

ఘనంగా దాశరథి శతజయంతి

నంద్యాల కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సినీగేయ రచయత, ప్రముఖ కవి కళాప్రపూర్ణ డా.దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను నంద్యాలలో ఘనంగా నిర్వహించారు. మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షులు డా.దివీ హయగ్రీవాచార్యులు, గౌరవసలహాదారులు డా. రవీంద్రనాథ్, కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రోటరీ విద్యాసంస్థల అధినేత డివి సుబ్బయ్య, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, కవులు ప్రసాద్, మహమ్మద్ రఫీ, తూము శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నందికొట్కూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయుడు పక్కీర్ సాహెబ్ విమర్శించారు. మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఇవ్వకపోవడంతో మార్కెట్ యార్డులోని సహకార మార్కెటింగ్ సొసైటీకి వచ్చారన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు దొరికితే నియోజకవర్గ స్థాయికి ఎందుకు వస్తారని ఆయన ప్రశ్నించారు. మహిళలు వచ్చి లైన్‌లో నిలబడి ఎరువులు తీసుకోవాలా అని ఆయన అధికారులను నిలదీశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఎరువులను అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రమణ, శ్రీరాములు, మద్దిలేటి, షరీఫ్, కొండయ్య, బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న ముర్తుజావళి

నందికొట్కూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు యూరియా, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చైర్మన్ షేక్ ముర్తుజావలి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రస్తుత అవసరాలకు మేర రైతులు యూరియా కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం సొసైటీలో యూరియా, కాంప్లెక్స్ డిఏపీలు 1040 బస్తాలు అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ సత్తార్మియా, కుమార్, అబ్దుల్లా లింగారెడ్డి , సొసైటీ సీ.ఈ.వో. రబ్బాని, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ



చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న మంత్రి, సిబ్బంది

నంద్యాల టౌన్, జూలై 22(ఆంధ్ర జ్యోతి): నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చెత్తా చెదారం రోడ్డు మీద కాల్వల్లో వేయకుండా డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వెంకటదాస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ కార్యదర్శిగా శంకర్‌గౌడు

కొత్తపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నంద్యాల జిల్లా కార్యదర్శిగా అగస్త్య శంకర్‌గౌడు ఎంపికయ్యారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎంపికలో కొత్తపల్లి మండలం, శివపురం గ్రామానికి చెందిన శంకర్‌గౌడును జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

అర్హులందరికీ టిడ్కో గృహాలు ఇస్తాం : మంత్రి



సుపరిపాలన తొలిఅడుగులో పాల్గొన్న మంత్రి , నాయకులు

నంద్యాల రూరల్ జూలై22(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఉన్న టిడ్కో ఇళ్లు త్వరలోనే పూర్తి చేసి అర్హులందరికీ పంపిణీ చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక 27 వార్డులో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసమర్థత వల్ల ఆగిపోయ్యాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రోడ్లన్నీ బాగు చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు అదేశించారు. వార్డుల్లో ప్రజలు నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జైనాబీ, దస్తగిరి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఏడాది పాలనతో ప్రజల్లో సంతృప్తి



బలపనూరులో ప్రభుత్వ పథకాలపై తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పాణ్యం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో ప్రజల్లో సంతృప్తి పెరిగిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఏడాది ప్రభుత్వంలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం బలపనూరులో ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, ప్రభుత్వ పనితీరుపై గ్రామప్రజలనడిగి తెలుసుకొని కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, శివశంకరరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, మోహన్, రమణమూర్తి, అమరసింహారెడ్డి, రాంపుల్లారెడ్డి, దానం, కార్యకర్తలు పాల్గొన్నారు.

- మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మాఢవీధుల స్థల సేకరణపై దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణతో చర్చించామన్నారు. మంగళవారం భోగేశ్వరంలో మంత్రిని కలిసి కొత్తూరు,భోగేశ్వర ఆలయాల సమస్యలను వివరించామన్నారు.

వైసీపీ వ్యతిరేక ఆరోపణలు తిప్పికొట్టాలి

పాములపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న వ్యతిరేక ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా పించన్‌పెంపు, ఉచిత గ్యాసు, కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, పేదవాడి కడుపు నింపేందుకు అన్నక్యాంటీన్లను ఏడాదిలోపే అమలుచేసిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందన్నారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని, అప్పులు తప్ప అభివృద్ధి లేదని జగన్‌రెడ్డి దోచుకోవడం తప్ప చేసిందేమి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మిట్టకందాల గ్రామంలో ఇంటింటికి సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

శ్రీకాళహస్తీశ్వరుడి సన్నిధిలో మంత్రి బీసీ దంపతులు


స్వామివారిని దర్శించుకున్న మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరున్ని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్థానిక శ్రీకాళహస్తీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో, ఆర్‌అండ్‌బీ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

త్వరలో 'అన్నదాత సుఖీభవ'

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద నగదును రైతుల ఖాతాల్లో కూటమి ప్రభుత్వం జమ చేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డు, మండలంలోని జగదుర్తి, ఉడుములపాడు, తాటిమాను కొత్తూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఉడుములపాడులో గోకులషెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్, ఓబులాపురం శేషిరెడ్డి, భాస్కర్ నాయుడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వాల్మీకి బోయ పెడరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణను ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సుంకులమ్మ దేవికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరానిగుండ్ల, దొరపల్లె గ్రామాల్లో ఆషాడమాసం పురస్కరించుకుని సుంకులమ్మ అమ్మవారికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు ఉంగరానిగుండ్లలోని తలారీ రంగనాయకులు, రంగస్వామి, మిట్టమద్దయ్య, దొరపల్లె మాజీ ఎంపీటీసీ వెంకటేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

ప్యాపిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఉద్యానవనశాఖ మండల అధికారి కళ్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: సీఐ

ప్యాపిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వెంగళాంపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో అందరు కలసిమెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చాగలమర్రి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సురేష్ అన్నారు. మంగళవారం చాగలమర్రి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల సంతమార్కెట్ పాఠశాలలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎంలు శివలక్ష్మి, శేషాద్రి, శక్తి టీమ్ పోలీసులు సుబ్బలక్ష్మి, బిలాల్, పీడీ భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి బాధాకరం

చాగలమర్రి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు టి.గురుప్రసాద్ (80) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, సల్లానాగరాజు, గుత్తి నరసింహులు, టైలర్ బాష, ఓబులేసు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంధత్వ నివారణే లక్ష్యం

ఉయ్యాలవాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కంటి వైద్యుడు రమేష్ తెలిపారు. అంధత్వ నివారణలో భాగంగా మంగళవారం స్థానిక ఆదర్శపాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. పాఠశాలలో 25 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సిబ్బంది ఉన్నారు.

ఎస్టీ బాలుర వసతి గృహం పరిశీలన

ఆళ్లగడ్డ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడకండ్ల గ్రామ సమీపంలో ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట శివప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన సదుపాలయాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని మరో చోటికి మార్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎస్టీ బాలుర వసతి గృహం ప్రిన్సిపాల్ లక్ష్మి గుర్రప్ప ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలు, సలహాలు, సూచనలు 9959225795ను సంప్రదించి ఇవ్వాలని సూచించారు.

బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలి

బేతంచెర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేపడుతున్న పీ-4 పథకంపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం నిర్మాణం
● వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్

డోన్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీఖానా సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం నిర్మించిన నూతన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారింది. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.99 లక్షల నిధులు మంజూరు చేయించి 2024, మార్చి 9న షాదీఖానా సమీపంలో నిర్మించారు. అయితే.. ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో నూతన భవన కార్యాలయం నిరుపయోగంగా మారింది. ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు పాతభవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణ వెలుపల ప్రభుత్వ ఐటీఐ సమీపంలో ఉన్న భవనంలోకి తరలించి సేవలు ప్రారంభించారు.

రూ.1.68కోట్ల నిధులతో..

2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎంగా ఉన్న కేఈ కృష్ణమూర్తి రూ.1.68కోట్ల నిధులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో పట్టణ వెలుపల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం స్థలం ఇచ్చిన దాత, టీడీపీ నాయకులు మురళీకృష్ణ గౌడు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణం వెలుపల ఉన్న భవనంలోనే కొనసాగించాలని ఉత్తర్వులు వచ్చాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణం వెలుపల ఉన్న భవనంలోకి మార్చారు. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని షాదీఖానా పక్కన సబ్ రిజిస్ట్రార్‌కార్యాలయం కోసం నిర్మించిన నూతన భవనం నిరుపయోగంగా మారింది. భవిష్యత్తులో నూతన ప్రభుత్వ కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇప్పటికే షాదీఖానా పక్కన ఉన్న నూతన భవనం ప్రాంగణంలోని బాత్‌రూములలో తాగి పడేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు దర్శనం ఇస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


భవనం ప్రాంగణంలో తాగి పడేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు


షాదీఖానా పక్కన నిరుపయోగంగా మారిన ప్రభుత్వ నూతన భవనం

ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలి



పట్టణంలోని షాదీఖానా పక్కన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం నిర్మించిన నూతన భవనాన్ని వినియోగంలోకి తీసు కురావాలి. అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించి భవనాన్ని కేటాయించాలి.

- నక్కి హరి, మండల కార్యదర్శి, డీవైఎఫ్ఐ

మట్టి విగ్రహాలతో గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి

- బనగానపల్లె కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారుడు టంగుటూరు శ్రీనయ్య


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనయ్య

బనగానపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మట్టివిగ్రహాలతో గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలని బనగానపల్లె కేంద్ర గణేశ్ ఉత్సాహ కమిటీ గౌరవ సలహాదారుడు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ గణేశ్ మట్టి విగ్రహాల వాడకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సొంత నిధులతో చిన్న మట్టివిగ్రహాలను తెప్పిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హిందూ బంధువులు, కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేసి మండపాల్లో మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించుకోవాలని తీర్మానించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 27న మండపాలల్లో గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించి ఐదురోజుల పూజల అనంతరం ఆగస్టు 31న నిమజ్జన కార్యక్రమం బనగానపల్లె మండలంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో టీచర్ నాగరాజు, కోడి నాగేశ్, గులాంనబీపేట రఘు, కూరగాయల శేఖర్, బాలుడు, భరతుడు, వంకదారి ప్రసాద్, సాయిరాం, గుండామురళి, గౌండసుబ్బయ్య, గడ్డం నాగమణి, సూర్య, కృష్ణం రాజు, టీచర్ ప్రతాప్, మనోహర్, బింగిమళ్ల సుబ్రమణ్యం, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే కరాటే నేర్చుకోవాలి

- బీసీ రాజారెడ్డి


కరాటే విద్యార్థిని అభినందిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే కరాటే తప్పక నేర్చు కోవాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం కడపలో నిర్వహించిన నాలుగో సౌత్ ఇండియా కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన కరాటే విద్యార్థులను బీసీ రాజారెడ్డి అభినందించారు. బనగానపల్లె మండలం పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న లక్ష్మీప్రియ, పద్మప్రియ, మైథిలి , భవిత, సిద్దార్థగౌడ్, పల్విని, మోహిత్ విజేతలుగా నిలిచి గోల్డ్, రజత పతకాలు సాధించారు. విజేతలకు బీసీ రాజారెడ్డి మెడల్స్ అందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు కరాటే భాష, చంద్రమోహన్ గౌడ్, చోటు, పిదా తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని అమ్మవారికి జలాభిషేకం


నీళ్ల బిందెలతో గంగాభవాని ఆలయానికి వస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఆశ్రమ వీధిలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారికి మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. మహిళలు బిందెలను తీసుకొని మేళతాళాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మండల సర్వేయర్ హెచ్‌కే గీతా గాయత్రి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఎంఎస్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ జగదీష్ బదిలీ కాగా, ఆయన స్థానంలో నంద్యాల సర్వే హెడ్ ఆఫీసు నుంచి గీతా బదిలీపై వచ్చారు.

పరిసరాల శుభ్రతకు సహకరించాలి

కొలిమిగుండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిసరాల శుభ్రత కు ప్రజలు సహకరించాలని కొలిమిగుండ్ల సర్పంచ్ జినుగు శివరాము డు కోరారు. మంగళవారం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పను లను సర్పంచ్ పర్యవేక్షించారు. ఇళ్లలోని చెత్త వీధుల్లో పడవేయరాదని సూచించారు. పారిశుధ్య కార్మికులు ఇళ్లకు వచ్చినప్పుడు చెత్తను ఇవ్వాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్య ప్రదాతలు

బనగానపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ఆరోగ్య ప్రదాతలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేంకటేశ్వరస్వామి భక్తమండలి సహకారంతో ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఎంపీడీవో రాధిక, ఈవోఆర్డీ బాలాంజనేయులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడంపై అభినందించారు. గ్రామ సర్పంచ్ సుమలత, బీసీ నాయకుడు శివశంకర్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా సూర్యనారాయణ

కొలిమిగుండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మండల కార్యదర్శిగా కల్వటాల తలారి సూర్యనారాయణ నియమితులైయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సుంకయ్య తదితరుల సమక్షంలో సూర్యనారాయణను ఎంపిక చేశారు. జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన సూర్యనారాయణ, మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

కేరళ మాజీ సీఎం మృతి తీరని లోటు

డోన్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం సీనియర్ నాయకులు కొండయ్య, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ నాయకులు శివరామ్ అన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, భాస్కర్ రెడ్డి, రామాంజనేయులు, నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ పోరాటాలు చిరస్మరణీయమని సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య అన్నారు. మంగళ వారం స్థానిక కార్యాలయంలో మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సాధిక్ హుశేన్, సుబ్బరాయుడు, వైబీ వెంకటేశ్వర్లు, మధుశేఖర్, సంజీవ నాయుడు, మద్దిలేటి స్వామి, రామాంజనేయులు, శ్రీను, రాజు, మద్దయ్య, ధనుంజయుడు, ఖాజా పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రానికి తాళం తిప్పలు

రైతులకు మెరుగైన సేవలందించేందుకు రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే వీటి ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయో.. లేదో కానీ ఇక్కడి పనిచేసే సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు. మండలంలోని కోటకొండ రైతు సేవా కేంద్రంలో పనిచేసిన వీఏఏ రేవతి కర్నూలు జిల్లా కౌతాళం మండలానికి బదిలీ వెళ్లారు. వీఏఏ రేవతి రైతు సేవాకేంద్రానికి తాళం వేసి తాళం చెవి తీసుకెళ్లింది. ఆ స్థానంలో ఈ నెల 10న ఉమాదేవి విధుల్లో చేరింది. 12 రోజులుగా తాళం చెవి కోసం ఎదురుచూడాల్సి దుస్థితి నెలకొంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వీఏఏ సచివాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. తాళంచెవి లేకపోవడంతో రైతులకు సేవలు అందడం లేదు. ప్రభుత్వ కార్యాలయం తాళం చెవి బదిలీపై వెళ్లిన వీఏఏ వద్ద ఉంచుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు అంటున్నారు.

● రుద్రవరం, ఆంధ్రజ్యోతి



కోటకొండలో తాళం వేసిన రైతు సేవా కేంద్రం
సచివాలయంలో కూర్చున్న వీఏఏ ఉమాదేవి

అదనపు ఉపాధ్యాయులను నియమిస్తాం



వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్య

రుద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో అదనపు ఉపాధ్యాయులను నియమిస్తామని ఇన్ చార్జి ఎంఈవో వీరరాఘవయ్య అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'విద్యార్థులు 80మంది.. ఉపాధ్యాయులు ఇద్దరే' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దాంతో ఇన్‌చార్జి ఎంఈవో వీర రాఘవయ్య పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందిస్తామన్నారు.

పీ4 సర్వే పేదలకు వరం: ఎంపీడీవో

రుద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు పీ-4 సర్వే వరమని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం కోటకొండ గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కోటకొండ పంచాయతీలో 105 బంగారు కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. ఇంకా అర్హులైన వారి ఉంటే దరఖాస్తు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్యదర్శి నరసింహావర్మ, సిబ్బంది, మాజీ ఎంపీటీసీ సత్యంరాజు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే కూటమి లక్ష్యం

చాగలమర్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్యేక అధికారి న్యామతుల్లా అన్నారు. మంగళవారం మండలంలోని మల్లెవేముల గ్రామంలో సర్పంచ్ ఈదుల సరోజమ్మ అధ్యక్షతన పీ-4 గ్రామ సభ నిర్వహించారు. నాలుగు కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగార్జున, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ కంపెనీల మాటలు నమ్మొద్దు'

రుద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పొగాకు కంపెనీల మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామచంద్రుడు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పొగాకు కంపెనీలు ధనదాహంతో అగ్రిమెంటు పేరుతో క్వింటాకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు చెల్లించి తామే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పండించి పొగాకును విక్రయించబోతే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఖరీఫ్‌లో మళ్లీ వచ్చి పొగాకు సాగుచేయాలని అడుగుతున్నారని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

తుండ్లవాగు రిజర్వాయర్ సందర్శన

రుద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తుండ్లవాగు రిజర్వాయరును తెలుగు గంగ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఈఈ జవహర్‌రెడ్డి, డీఈలు సత్యంరాజు, గురుమూర్తి, అనిల్‌కుమార్‌రెడ్డి 21, 22 గంగ బ్లాక్‌చానెళ్లతో పాటు 25, 28 ఛానళ్లు పరిశీలించారు. తుండ్లవాగు రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 0.65 టీఎంసీలగా నిల్వ ఉందన్నారు. కడప జిల్లాకు 2700 క్యూసెక్కులు నీటి సరఫరా అవుతుందని వారు తెలిపారు. వారి వెంట స్థానిక ఏఈలు మోహన్‌కృష్ణారెడ్డి, వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కుందూకు వరద ఉధృతి

చాగలమర్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద మంగళవారం కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుందూ, వక్కిలేరులో వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. మల్లెవేముల గ్రామ సమీపంలో కుందూ వరద ఉధృతి పెరగడంతో నదీ పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నిండిన చెరువులు

రుద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువులను తెలుగు గంగనీటితో నింపినట్లు ఏఈ రఘురామ్ మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు 16 ఎంఐ చెరువులు నిండాయని వివరించారు.

ఘనంగా ప్రపంచ బ్రెయిన్ డే


డాక్టర్లను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

డోన్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ప్రపంచ బ్రెయిన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు. డోన్ రోటరీ క్లబ్ ఫౌండర్ రాజా విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్లు రాజేంద్రప్రసాద్ రెడ్డి, రాజశేఖర్ హార్ట్ అండ్ బ్రెయిన్‌పై అవగాహన కల్పించారు. వైద్యులను సన్మానించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జింకల కృష్ణ, కార్యదర్శి బలరాం, సభ్యులు జగన్మోహన్, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, శివశంకర్‌గౌడు, రాజయ్య గౌడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

బనగానపల్లె, జూలై 22, (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులు వాడి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పసుపుల, పాతపాడు గ్రామాల్లో వేసిన మొక్కజొన్న పంటలను ఆయన స్వయంగా పరిశీలించారు. గ్రామ రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయశాఖ అనుబంధ సిబ్బంది, ప్రకృతి వ్యసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులతో లాభాలు

కొలిమిగుండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని బి.ఉప్పలూరు, బి.తాడిపత్రి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు నాగరాజు, వనిత, వీఏఏలు చంద్రశేఖర్, మనోహర్, సునియాబేగం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చాగలమర్రి : రైతులు పంట మార్పిడి చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ సూచించారు. మంగళవారం చిన్నవంగలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

శిరివెళ్ల: ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఆళ్లగడ్డ సహాయ సంచాలకులు విజయ శేఖర్ హెచ్చరించారు. శిరివెళ్లలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం జీనేపల్లె, వనికెందిన్నెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు : మొక్కజొన్న సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కలిమున్నీసా అన్నారు. మంగళవారం చెర్లోపల్లెలో రైతులు సాగుచేసిన మొక్క జొన్న పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించారు.

సంజామల : నానో ఎరువులను రైతులు వాడాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం సంజామలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానో ఎరువుల ద్రావణం ఉపయోగించడంపై రైతులకు అవగాహన కల్పించారు.

సేవలతోనే గుర్తింపు

సంజామల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అన్నారు. మంగళవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మోహన్‌రావు జమ్మలమడుగుకు బదిలీపై వెళ్లారు. అలాగే పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది బదిలీ కాగా సన్మానించారు. మోహన్‌రావు విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.